సాక్షి ఒడిశా

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,45,137లు వచ్చాయని అధికారులు తెలిపారు.



కిసాన్ యోజనపై సమీక్ష

దక్షిణాంచల్ ఆర్డీసీ(రెవెన్యూ డివిజనల్ కమిషనర్) రూపారోషన్ సాహు గురువారం రాయగడలో పర్యటించారు.

- 8లో.



శ్రీమందిరంలో కలకలం

పూరీ శ్రీజగన్నాథ స్వామి శ్రీమందిరం శిఖరంపైకి గుర్తు తెలియని వ్యక్తి గురువారం ఎక్కి కలకలం సృష్టించాడు.

- 8లో.

న్యూస్‌రీల్

ఈనెల 17న ప్రధాని మోదీ పర్యటన



భువనేశ్వర్: ఈనెల 17వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో జంట నగరాల కమిషనరేట్ పోలీసులు గురువారం భద్రతా ఏర్పాట్లపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాని స్థానిక జనతా మైదాన్‌లో సుభద్ర పథకాన్ని ప్రారంభించి భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏర్పాట్లు, రూట్ లైనింగ్, వేదిక భద్రతపై ప్రధానంగా చర్చించినట్లు పోలీసు కమిషనర్ సంజీవ్ పండా తెలిపారు. వీవీఐపీలు మరియు ఇతర ప్రముఖులతో కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ పూర్తిస్థాయి భద్రతను కల్పించే దిశలో ఈ సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ప్రధానమంత్రి భద్రత బ్లూ బుక్ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భద్రతా కార్యకలాపాల పర్యవేక్షణకు స్థానిక జనతా మైదాన్‌లో తాత్కాలిక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. డాగ్ స్క్వాడ్ మరియు బాంబు డిస్పోజల్ స్క్వాడ్ నిరంతరం వేదిక ప్రాంగణంలో నిఘా నిర్వహణలో పాలుపంచుకుంటాయన్నారు. విమానాశ్రయం నుంచి జనతా మైదాన్ వరకు పటిష్టమైన బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. డీజీపీ వై.బి.ఖురానియా, కమిషనర్ సంజీవ్ పండా, డీసీపీ ప్రతీక్ సింగ్ ప్రధానమంత్రి పాల్గొనే బహిరంగ సమావేశం ప్రాంగణం ప్రత్యక్షంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. భద్రత, శాంతిభద్రతల ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్త వహిస్తున్నారు.

అన్ని గ్రామాల్లో 'స్వచ్ఛ భారత్'



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని ప్రతీ పంచాయతీ, సమితి కేంద్రాలు, ఎన్ఏసీ, పురపాలక, జిల్లా కేంద్రంలో స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అధికారులకు సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ సీడీఎం గుణనిధి నాయక్, ఏడీఎం రాజేంద్ర మింజ్, అదనపు కార్యనిర్వాహక అధికారి పృథ్వీరాజ్ మండల్, ఐటీడీఏ అధికారి దిలీప్ కుమార్ బెహరా, పురపాలక ఈవో గౌర చంద్ర పట్నాయిక్, సెంచూరియన్ వర్సిటీ డైరక్టర్ డా.దుర్గాప్రసాద్ పాఢి తదితరులు పాల్గొన్నారు.


చెపిటిఅంబలో అతిసారం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

జయపురం: నబరంగపూర్ జిల్లా జోరిగాం సమితి చెపిటిఅంబ గ్రామంలో అతిసార వ్యాధి విస్తృతంగా వ్యాపిస్తోంది. ఇప్పటికే ఈ గ్రామంలో ముగ్గురు మరణించిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన డాలి జాని ఆరోగ్యం క్షీణించడంతో అతడిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా అతిసారం నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తాజా ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



గౌరి కుమారి (ఫైల్)

రాయగడ: స్థానిక కరణం వీధిలో నివాసముంటున్న గుడ్ల గౌరి కుమారి (61) అనే మహిళ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. గురువారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం గురువారం ఉదయం వేడినీళ్లు కాచేందుకు బకెట్‌లో విద్యుత్ వాటర్ హీటర్ పెట్టింది. ఈ క్రమంలో నీరు వేడెక్కాయో లేదో చూసేందుకు బకెట్‌ను పట్టుకోగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయింది. దీంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

వర్షం తగ్గింది.. నష్టం మిగిలింది

● రాష్ట్రంలో తగ్గుముఖం పట్టిన వర్షం ● ముంపు నుంచి తేరుకుంటున్న గ్రామాలు ● నష్టాలతో లబోదిబోమంటున్న ప్రజలు

వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన వర్షాలు ప్రజలకు తీవ్ర నష్టాలను మిగిల్చాయి. చాలా ప్రాంతాల్లో గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో ఇళ్లు ముంపునకు గురయ్యాయి. దీంతో ఇళ్లలోని సామగ్రి, విలువైన వస్తువులు నీటిపాలయ్యాయి. పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇళ్లలోని బురద చేరడంతో విషపురుగులు, సర్పాలు, దోమల బెడద వెంటాడుతోంది. వీటి ప్రభావంతో అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రహదారులు దెబ్బ తినడంతో ఇంకా రాకపోకలకు అంతరాయం తప్పడం లేదు.



కూలిపోయిన చైతన్య ఇల్లు

గూడు లేక గోడు



కూలిపోయిన గోడ

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితిలో నిరుపేదలైన మూడు కుటుంబాలకు చెందిన ఇళ్లు వర్షాల కారణంగా కుప్పకూలాయి. దండియా వీధిలో నివస్తున్న త్రినాథ్ బిబర్, 15వ వార్డు ధగుడిమాల్ గ్రామంలో నివసిస్తున్న ఎస్.చైతన్య, సువాసరాయి నాగేశ్వర్లకు చెందిన ఇళ్ల గోడలు వర్షాలు కారణంగా కూలిపోయాయి. దీంతో ఈ మూడు కుటుంబాలు ప్రస్తుతం నిరాశ్రయులయ్యారు. సర్పంచ్ గౌతం బర్లా బాధితులను పరామర్శించి ప్రభుత్వం ద్వారా తగిన ఆర్థిక సహకారం అందిలే చూస్తామని భరోసా ఇచ్చారు.

పంట నష్టం అపారం



పంట నష్టాలు అంచనా వేస్తున్న అధికారులు

జయపురం: వర్షాలతో జయపురం సబ్ డివిజన్‌లో భారీగా పంటనష్టం ఏర్పడింది. ఇంతవరకు ప్రాథమిక అంచనాల ప్రకారం 4,503 ఎకరాల్లో పంటలు నీట మునిగాయని జిల్లా వ్యవసాయ అధికారి ప్రభాత్ కుమార్ మహంతి గురువారం వెల్లడించారు. కుంద్ర సమితిలో 3,274 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. అదేవిధంగా జయపురం సమితిలో 385 ఎకరాలు, కోట్‌పాడ్ సమితిలో 573 ఎకరాలు, బొయిపరిగుడ సమితిలో 182 ఎకరాలు, బొరిగుమ్మ సమితిలో 89 ఎకరాల్లో పంటలు నీట మునిగాయన్నారు. పూర్తి అంచనాలు తర్వాత వాస్తవ నష్టం తెలుస్తుందని పేర్కొన్నారు.

సీఎం మోహన్ చరణ్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు




మల్కన్‌గిరిలో సీఎం మోహన్ పర్యటన

మల్కన్‌గిరి: జిల్లాలోని వరద ప్రాంతాల్లో సీఎం మోహన్ చరణ్ మాఝీ గురువారం పర్యటించారు. ప్రత్యేక హెలీకాప్టర్‌లో ఎంవీ 3 గ్రామం బీఎస్ఎఫ్ క్యాంప్ వద్ద దిగిన ఆయనకు కలెక్టర్ ఆశిష్ పటేల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వరదలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 8,830 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, 278 ఇళ్లు ప్రభావితమయ్యాయని అధికారులు తెలియజేశారు. మొత్తం 12 వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించిందని, 6 ఓడ్రాఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అనంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ పూజారి మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో నష్టపోయిన ప్రజలందరికీ నష్ట పరిహారం అందజేస్తామని తెలియజేశారు. 2025 జనవరి నాటికి రహదారులు, పాఠశాలలకు మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తృతంగా అందజేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పర్యటనలో నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝీ, సీఎస్ మనోజ్ అహుజా, చీఫ్ రిలీఫ్ కమిషనర్ విష్ణుపదో శెతి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి, కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్, ఎస్పీ నితీష్ వాద్వానీ, అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

కల్వర్టర్ పనుల పునరుద్ధరణ



ప్రారంభమైన కల్వర్టర్ పనులు

జయపురం: వర్షాలకు ఈనెల 8వ తేదీన దశమంతపూర్ పంచాయతీ గరుడగుడ గ్రామ సమీపంలో ఒక కల్వర్టర్ కొట్టుకుపోయింది. దీంతో రాజుగుడ, భరువగుడ, ఉచ్చులగుడ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అందువలన ఆ మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆ గ్రామాల ప్రజలు రేషన్ బియ్యం, విద్యార్థుల చదువులు తదితర అవసరాలకు దశమంతపూర్‌పైనే ఆధారపడుతుంటారు. కానీ రహదారి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజల పరిస్థితి చూసిన గ్రామ సర్పంచ్ ఆర్.రోహిత్ కుమార్ కంట్రాక్టర్ మనోజ్ పాడీని పిలిచి వెంటనే కల్వర్టర్ నిర్మాణం చేపట్టాలని కోరారు. అందుకు కావాల్సిన సాయం తాను అందిస్తానని ఒప్పించారు. కావాల్సిన హ్యూమ్ పైపులను తెప్పించి పనులు ప్రారంభించారు. దీంతో సర్పంచ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రైవేటు బస్సుల బంద్ ప్రశాంతం



కొత్త బస్టాండ్‌లో నిలిచిన ప్రైవేటు బస్సులు

పర్లాకిమిడి: గజపతి జిల్లావ్యాప్తంగా ప్రైవేటు బస్సుల యాజమాన్య సంఘం గురువారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ ప్రభావంతో కొరాపుట్, రాయగడ, గుణుపురం, పర్లాకిమిడి నుంచి ఉప్పలాడ, రాయఘడ, ఆర్.ఉదయగిరి, మోహనా, శ్రీకాకుళం, విజయనగరం, బరంపురానికి వెళ్లే బస్సులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గజపతి ప్రైవేటు బస్సుల యాజమాన్యం సంఘం కార్యదర్శి ఇంజా వెంకటరమణ మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో లక్ష్మీ బస్సులు పంచాయతీల నుంచి బ్లాక్ హెడ్ క్వార్టర్స్‌కు తిప్పకుండా, సమితి కేంద్రాల నుంచి జిల్లా కేంద్రంకు తిప్పుతున్నారని, దీనివల్ల తమకు తీవ్రనష్టం కలుగుతోందని వాపోయారు.

గతంలో దీనిపై రాష్ట్ర అదనపు ట్రాన్స్‌పోర్టు కమిషనర్ హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో పంచాయతీల నుంచి సమితి కేంద్రాలకు లక్ష్మీ బస్సులు తిరుగుతున్నాయని, కానీ అందుకు భిన్నంగా గజపతిలో లక్ష్మీబస్సులు నడపడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందన్నారు. దీనిపై శుక్రవారం ఒడిశా రాష్ట్ర ఆర్టీసీ కమిషనర్‌తో భువనేశ్వర్‌లో చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు శ్రీను సాహుకార్, కిల్లారి గోపి, రాకేష్ సాహుకార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీల నివారణకు చర్యలు తీసుకోండి

● ఐఐసీకి కళింగ వైశ్య సంఘం వినతి



ఐఐసీ కుహోరొకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

రాయగడ: పట్టణంలో తరచూ దొంగతనాలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్ వంటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారని, దీనిపై పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కళింగ వైశ్య సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సదరు పోలీస్‌స్టేషన్ ఐఐసీ కేకేబీకే కుహోరోకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ముందుగా సంఘం అధ్యక్షుడు కింతలి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సంఘానికి చెందిన ఇప్పిలి సన్యాసిరాజు, వడ్డి మురళి, సూరు అప్పలనరసయ్య, చిన్నారి విజయ్ మోహన్ తదితరులు పోలీస్‌స్టేషన్ ఎదుట తమ నిరసనను వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక పాత పోలీస్‌స్టేషన్ ఎదుట చైన్ స్నాచింగ్‌కు యత్నించిన దుండగుల ఆచూకీ కనిపెట్టాలని కోరారు. పట్టపగలే ఇటువంటి అఘాయిత్యాలు చోటుచేసుకుంటుండడంతో మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఐఐసీ కుహోరో మాట్లాడుతూ దోపిడీలు జరుగుతున్న ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థను పెంచామని తెలిపారు. అయితే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అవుట్ సోర్సింగ్ వైద్య సిబ్బంది ఆందోళన



ఆందోళన చేస్తున్న అవుట్ సోర్సింగ్ వైద్య సిబ్బంది

రాయగడ: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న నర్సులు, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులపై సవతి ప్రేమ చూపిస్తోందని ఆయా సంఘాలకు చెందిన ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఫరూల్ పట్వారికి వినతిపత్రం అందజేశారు. గత నాలుగేళ్లుగా ఆరోగ్య శాఖలో ఎన్నో సేవలు అందిస్తున్నా, తమను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న సన్నాహాలు సరికాదని వాపోయారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తాము అందించిన సేవలు గుర్తుచేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని, లేదంటే భవిష్యత్‌లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాలకు చెందిన శిబాని మహంతి, అహల్య ఖొర, గంగోత్రి బెహర తదితరులు పాల్గొన్నారు.

జనసేవ కేంద్రం సీజ్



సీజ్ చేసిన జనసేవ కేంద్రం

భువనేశ్వర్: సుభద్ర యోజన దరఖాస్తుదారుల నుంచి డబ్బు డిమాండ్ చేసినందుకు జనసేవ కేంద్రాన్ని గురువారం అధికారులు సీజ్ చేశారు. ఖుర్దా మున్సిపాలిటీలోని ముకుందప్రసాద్ వద్ద ఈ విషయం వెలుగు చూడడంతో ఖుర్దా జిల్లా యంత్రాంగం జనసేవ కేంద్రంపై చర్యలు తీసుకుంది.

అంతిమ సంస్కారాలకు అవస్థలు

జయపురం: అధిక వర్షాలతో అంతిమ సంస్కారాలు చేయలన్నా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కొరాపుట్ జిల్లా బందుగాం సమితి ఝుంజావతి నది ఒడ్డున ఇల్లు కట్టుకొని నివసిస్తున్న దాలి గదావు(62) అనే వృద్ధురాలు గురువారం మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఝుంజావతి నది అవతల వైపున శ్మశానం ఉంది. వర్షాలు కురుస్తుండడంతో పొంగి పొర్లుతోంది. దీంతో నదిలోనే నడుచుకుంటూ మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లారు.

నదిపై వంతెన నిర్మించాలని ఎంతోకాలంగా స్థానికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో నది నుంచి అవతలి ఒడ్డుకు చేరాలంటే ప్రాణంతో చెలగాటమేనని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



నదిలో నడుచుకుంటూ మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

'సుభద్ర'కు కేవైసీ అవసరం లేదు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17వ తేదీన ప్రారంభించనున్న సుభద్ర పథకానికి కేవైసీ లింక్ అవసరం లేదని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో ఇప్పటివరకు 68,641 దరఖాస్తులు పోర్టల్‌లో నమోదు జరిగిందన్నారు. జిల్లాలోని ఏడు సమితి కేంద్రాలు, ఎన్.ఏ.సీ, పురపాలక పరిధిలో 1,70,000 మందికి సుభద్ర పథకం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గుమ్మా సమితి అండార్ సింగి గ్రామ పంచాయతీలో ఒక సీఎస్‌సీ కేంద్రంలో పథకం నమోదుకు డబ్బులు వసూలు చేయడంతో, ఆ కేంద్రంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

క్లుప్తంగా

తవిటమ్మ నేత్రాలు సజీవం


నేత్రదాత తవిటమ్మ

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని న్యూ కాలనీ వద్ద గల సాయి పార్వతి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కిల్లంశెట్టి తవిటమ్మ(74) అనారోగ్య కారణంగా గురువారం మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు ఎస్‌ఎస్ జువలరీస్ అధినేతలు సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్ నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు నంది ఉమాశంకర్‌లు కార్నియాలను సేకరించారు. వీరి నేత్రాలను విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాతల కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.

ఐదు కిలోల కణితి తొలగింపు


తొలగించిన 5 కేజీల కణితి ఇదే

కాశీబుగ్గ: పలాస కిడ్నీ ఆస్పత్రిలో గురువారం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర గ్రామానికి చెందిన యండమూరి సరసమ్మ అనే మహిళ కడుపులో 5 కేజీల కణితితో ఇబ్బందులు పడుతుండగా ఆపరేషన్ చేసి తొలగించారు. ఈ ఆపరేషన్‌ను ప్రసూతి వైద్యులు డాక్టర్ కవిటి సాహితి, మత్తు డాక్టర్ తృప్తిలు ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, సివిల్ సర్జన్ మెడికల్ రెసిడెంట్ ఆఫీసర్ డాక్టర్ కూన మోహన్ బాబు అభినందించారు. బయట ఈ ఆపరేషన్ చేయడానికి రూ.లక్ష ఖర్చు అవుతుందని పూర్తి ఉచితంగా చేసుకున్నామని తెలిపారు.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు గణేష్


గణేష్

కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం రాజాం పంచాయతీ ధర్మపురం గ్రామానికి చెందిన రెల్ల గణేష్ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుంచి 22 వ తేదీ వరకు ముంబైలో జరగనున్న జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు గణేష్ హాజరవుతాడని శిక్షకుడు నెయ్యిల భాస్కరరావు తెలిపారు. ఈ నెల 8వ తేదీన గుంటూరులో జరిగిన 60 కిలోల బరువు విభాగంలో ప్రథమ స్థానం సాధించారు.

పాముకాటుతో మహిళ మృతి


ఖండ్యాపు లక్ష్మి (ఫైల్)

బూర్జ: బూర్జ గ్రామానికి చెందిన ఖండ్యాపు లక్ష్మి (53) పాము కాటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలియజేశారు. లక్ష్మి గురువారం సాయంత్రం గ్రామం దగ్గరలో విజయపురం వ్యవసాయ పొలంలో కలుపు తీయడానికి వెళ్లింది. చీకటి పడినా ఆమె ఇంటికి రాకపోవడంతో భర్త రాము గ్రామస్తులతో వెతడానికి వెళ్లారు. వ్యవసాయ పొలంలో పడి ఉండడం చూసి నిశ్చేష్టులయ్యారు. అప్పటికే ఆమె పాముకాటుతో చనిపోయి ఉంది. వెంటనే మృతదేహాన్ని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. 108 వాహనంలో మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. భర్త రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేశారు.

ప్లాంటేషన్ పూర్తికి ఆదేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని తక్షణమే పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టి రాజు సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వన మహోత్సవాలు కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని సిబ్బంది చేపట్టాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రతి మండలంలోని కనీసం 20 రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను చేపట్టాలన్నారు.

కిసాన్ యోజనపై సమీక్ష


పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: దక్షిణాంచల్ ఆర్డీసీ(రెవెన్యూ డివిజనల్ కమిషనర్) రూపారోషన్ సాహు గురువారం రాయగడలో పర్యటించారు. దీనిలో భాగంగా స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అధికారులతో వివిధ పథకాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి కిసాన్ యోజన పథకంపై క్షేత్రస్థాయిలో సమీక్షించిన ఆమె ఈ పథకం ద్వారా ఎంతమంది లబ్ధి పొందుతున్నారు అనే వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా డ్రోన్ మాధ్యమంలో ఫసల్ బీమా సర్వే ఎంతవరకు కొనసాగించారని ఆరా తీశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సుభద్ర పథకంలో ఎంతవరకు పనులు ముందుకు సాగాయని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఫరూల్ పట్వారీ మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 3.90 లక్షల మంది సుభద్ర దరఖాస్తులను పంపించడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు వివిధ కేంద్రాల ద్వారా 3,20,418 ఫారాలను పంపిణీ చేశామన్నారు. సుభద్ర పథకంపై సంతృప్తిని వ్యక్తం చేసిన ఆర్డీసీ అనంతరం జిల్లా మాతా, శిశు సంక్షేమ పథకాన్ని సమీక్షించారు. అదేవిధంగా జిల్లాలో విద్యా, ఆరోగ్య, రహదారులు, రవాణా తదితర సమస్యలకు సంబంధించి క్షుణ్ణంగా సమీక్షించారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

ఇచ్ఛాపురం /రూరల్: పేదలకు ప్రభుత్వం ఇచ్చిన పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతోంది. కొంత మంది వ్యాపారులు లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేస్తూ పీడీఎఫ్ బియ్యంను ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరవేసి, అక్కడ నుంచి రైలు మీద ఒడిశా ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పౌరసరఫరాల అధికారులు స్పందించారు. గురువారం వేకువ జామున ఐదు గంటలకు సీఎస్‌డీటీ సంతోష్‌కుమార్ తన సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకొని బియ్యం మూటలను పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న పట్టణం ఉప్పల వీధికి చెందిన గేదెల ధనలక్ష్మీతో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. 34 ప్లాస్టిక్ బ్యాగుల ద్వారా 14 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకుని ఎంఎల్‌ఎస్ ఇన్‌చార్జికి అప్పగించి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెల రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు వ్యాపారులకు బియ్యం అమ్మకాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత లబ్ధిదారుల రేషన్ కార్డును రద్దు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల జిల్లా పర్యటన రేపు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జలుమూరు మండలంలోని ఎస్టీ మాకివలస, మెళియాపుట్టి మండలంలోని కేరశింగి గూడ గ్రామాల్లో 14వ తేదీన పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు గిరిజన నాయకులు బెజ్జి కృష్ణారావు, జన్ని దాలయ్య, మన్మధరావు, లక్ష్మణ తదితరులు న్నారు.

విశాఖ స్పోర్ట్స్ అకాడమీకి నరసన్నపేట విద్యార్థిని


దివ్యధాత్రితో పాటు తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పి.దివ్యధాత్రి వాలీబాల్ విభాగంలో విశాఖ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికైంది. వారం క్రితం విశాఖ పోర్టు స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్‌ఏఐ) ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు.

ఇందులో దివ్యధాత్రి మెరుగైన ఆటతీరు కనబరిచి జిల్లా నుంచి అకాడమీకి ఎంపికైంది. ఈమేరకు స్కూల్ హెచ్‌ఎం వెంకటరావు గురువారం తెలిపారు. దివ్యధాత్రితో పాటు తల్లిదండ్రులను గురువారం స్కూల్‌లో సత్కరించారు. నరసన్నపేట లయన్స్ క్లబ్ ప్రతినిధి ఊణ్ణ రంగనాథ్ రూ. 2500 నగదు బహుమతిని ఇచ్చారు.

చెరువులో పడి ఉపాధి వేతనదారుడు మృతి


చెరువులో పడి మృతి చెందిన సన్యాసిరావు

రణస్థలం: మండలంలోని పిషిణి పంచాయతీలో గల పతివాడపాలెం గ్రామానికి చెందిన సోపేటి సన్యాసిరావు(53) అనే ఉపాధి హామీ వేతదారుడు చెరువులో పడి మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు, ఉపాధిహామీ వేతనదారులు తెలిపిన వివరాలు ప్రకారం.. పతివాడపాలెంలో గ్రామంలో గల పెద్ద చెరువులో ఎన్‌ఆర్‌జీఎస్ పనుల్లో భాగంగా చెరువు గట్టుపై గురువారం తుప్పలు కొట్టారు. ఇంటికి వెళ్లే సమయంలో సాయంత్రం 5 గంటలకు కాళ్లు, చేతులు కడుక్కోవాలని సన్యాసిరావు చెరువులో దిగి ప్రమాదవశాత్తు జారిపడి మునిగిపోయాడు. మృతుడికి ఈత రాకపోవడంతో పాటు చెరువు లోతుగా ఉండటం వల్ల వెంటనే మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య గన్నెమ్మ, వివాహాలైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గన్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై ఎన్‌ఆర్‌జీఎస్ జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఏపీఓ శ్రీనివాసనాయుడు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పర్లాకిమిడి: పట్టణంలోని గొల్లవీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండితులు జోస్యుల ప్రదీప్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామనగుడలో కలెక్టర్ పర్యటన


జనసేవ కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్ పట్వారి

రాయగడ: జిల్లాలోని రామనగుడలో కలెక్టర్ ఫరూల్ పట్వారి గురువారం పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సుభద్ర యోజన పథకంలో భాగంగా జనసేవ కేంద్రాల్లో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించిన ఆమె ఆయా కేంద్రాల్లో సిబ్బందితో మాట్లాడారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా దరఖాస్తు చేసే విషయంలో ఎవరి దగ్గర ఎటువంటి రుసుం తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఆదివాసీలను మోసగించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆమెతో పాటు గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్, రాయగడ డీడీవో అమూల్య సాహు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలు

నందిగాం: మండలంలోని మద్దిలివాని పేట సమీపంలో గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్దతామరాపల్లికి చెందిన టొంప రమణయ్య(54) తీవ్రంగా గాయపడ్డారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణయ్య పెద్దతామరాపల్లి నుంచి మద్దిలివానిపేటలో ఉన్న తన పొలం చూడడానికి సైకిల్‌పై వెళ్తుండగా టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రమణయ్య కింద పడిపోయాడు. స్థానికులు రమణయ్యను టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓకు గాయాలు


తీవ్రంగా గాయపడిన మామిడివలస సచివాలయం వీఆర్వో దూసి సంజీవరావు

బూర్జ: మండలంలో గల పెద్దపేట గ్రామ జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడివలస సచివాలయం వీఆర్వో దూసి సంజీవరావుకు తీవ్రగాయాలయ్యాయి. విధులకు హాజరయ్యేందుకు పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారిలో మోటారు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగినట్లు ఆయన తెలియ జేశారు. ముక్కుపై బలమైన గాయం తగలడంతో 108 వాహనంతో పాలకొండ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.


అక్కడి నుంచి మెరుగైన వైద్యం వేటు హస్పటిల్‌కు తరలించారు. అక్కడ నుంచి శ్రీకాకుళం తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీమందిరంలో కలకలం


పోలీసుల అదుపులో ఉన్న వృద్ధుడు


భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ స్వామి శ్రీమందిరం శిఖరంపైకి గుర్తు తెలియని వ్యక్తి గురువారం ఎక్కి కలకలం సృష్టించాడు. శ్రీమందిరంలో రక్షణ, భద్రతా వ్యవస్థ డీలా పడడంతో ఇటువంటి ప్రమాదకర పరిస్థితులను ప్రేరేపిస్తున్నాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీమందిరం శిఖరాన నీల చక్రం ప్రాంగణంలో పతిత పావన పతాకం దగ్గరకు ఈ వ్యక్తి ఎక్కాడు. తనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు స్థానిక పోలీస్ సూపరింటెండెంట్ తెలిపారు. నిందిత వ్యక్తి గంజాం జిల్లా ఛత్రపురం నివాసిగా ఎస్పీ పేర్కొన్నారు. తదుపరి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. నిత్యం నీల చక్రానికి పతిత పావన పతాకం ఏర్పాటు చేయడం ఆనవాయితీ. చున్నార్ వర్గీయ సేవకులు ఈ ప్రక్రియలో పాల్గొంటారు. వీరు నిత్యం ఎక్కి దిగేందుకు ఏర్పాటుచేసిన గొలుసులు ఆధారంగా ఈ వ్యక్తి పైకి ఎక్కినట్లు పేర్కొన్నారు. నీల చక్రం పతిత పావన పతాకం తెగిపోతున్నట్లు దృష్టికి రావడంతో ఈ చర్యకు పాల్పడినట్లు వృద్ధుడు మీడియాకు తెలిపారు.

హిరాకుద్ వరద నీరు విడుదల


హిరాకుద్ జలాశయం వరద నీరు విడుదల

భువనేశ్వర్: మహానది ఎగువన భారీ వర్షపాతం కారణంగా హిరాకుద్ జలాశయంలో వరద నీరు ప్రవాహంతో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. నీటిమట్టం నిర్వహణలో భాగంగా దిగువ ప్రాంతాలకు వరద నీరు విడుదల చేస్తున్నారు. హిరాకుద్ డ్యామ్ మరో రెండు గేట్లను తెరిచారు. ప్రస్తుతం అదనపు నీటిని ఆరు స్లూయిస్ గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. వీటిలో ఎడమ వైపు 4 మరియు కుడి వైపు 2 గేట్లు గుండా వరద నీరు విడుదల అవుతుంది.

ఏనుగు కళేబరం లభ్యం


ఏనుగు కళేబరం

భువనేశ్వర్: ఒడిశాలో మయూర్‌భంజ్ జిల్లాలోని బెట్నోటి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో గురువారం తెల్లవారుజామున ఆడ ఏనుగు మృతి చెందింది. ఏనుగు కళేబరాన్ని గుర్తించిన కురాడిక్ గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. బరిపాద డీఎఫ్‌వో ఉమా మహేష్, రేంజర్ మోన్వర్ ఖాన్, ఇతర అటవీ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. 14 ఏళ్ల పాచిడెర్మ్ వ్యవసాయ క్షేత్రం చుట్టూ స్థానికులు వేసిన తాత్కాలిక విద్యుత్ తీగ తాకడంతో ప్రమాదం జరిగింది. రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి, దాని మరణానికి దారి తీస్తుంది.

19 నుంచి 21 వరకు క్విజ్ పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో గురువారం క్విజ్ పోటీలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు క్విజ్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి, సౌత్ ఇండియా, జాతీయ స్థాయి విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బిఐ90.క్విజ్.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌డీఎం ఉమాశంకర్, బ్యాంకు అధికారులు రవిబాబు, లక్ష్మీనారాయణ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి


మృతి చెందిన వీరయ్య (ఫైల్)

సారవకోట: మండల కేంద్రంలోని రెల్లివీధిలో ఇంటి గోడ కూలి కోటిపల్లి వీరయ్య (65) బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. వర్షాలకు ఇంటి గోడ బాగా నానిపోవడంతో బుధవారం అమాంతం వీరయ్యపై కూలిపోయింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. తొలుత ఆయనను నరసన్నపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య సింహాద్రి, వివాహితులైన నలుగురు పిల్లలున్నారు. కూలిపోయిన ఇంటి గోడను ఆర్ఐ బేగం వీఆర్వో గౌరమ్మ పరిశీలించారు.

పుట్టపర్తి మందిరానికి చాపరలో ప్రసాదం తయారీ



ప్రసాదం తయారు చేస్తున్న చాపర గ్రామానికి చెందిన తయారీదారులు (ఇన్‌సెట్లో) తయారు చేసిన బాల్సాలు

మెళియాపుట్టి: పుట్టపర్తి సత్యసాయి మందిరం కోసం ప్రసాదం తయారు చేసి పంపించాలని చాపర గ్రామానికి చెందిన నెయ్యిల లక్ష్మి, కృష్ణ దంపతులకు అవకాశం వచ్చినట్టు వారు తెలిపారు. పుట్టపర్తి ఆలయంలో భక్తులకు అందించడానికి లడ్డూ, కాజా, బాల్సా వంటి రకాలు 10500 పీసులు తయారుచేసి పంపించాలని వారికి పిలుపు వచ్చింది. దీంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.70వేలు విలువ చేసే ప్రసాదాలను సత్యసాయి మందిరానికి తయారుచేసి అందించ డంపై తయారీదారులతో పాటు గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత నాణ్యత, రుచికరంగా తయారు చేసి రెండురోజుల్లోనే సత్యసాయి సన్నిధికి పంపిస్తామని తయారీదారులు తెలిపారు.

ఇది మా అదృష్టం



చాపర పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శైలజారాణి వల్ల ఈ అవకాశం వచ్చింది. లాభాలు ఆశించకుండా నాణ్యతతో తయారు చేస్తాం. నాకు తెలిసి శ్రీకాకుళం జిల్లాలో మొట్టమొదటిసారి ఈ అవకాశం మాకే దక్కిందని అనుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది. సత్యసాయి మందిరానికి అందించడానికి తయారుచేస్తున్న ప్రసాదం కావడంతో నిష్ఠ నియమాలతో ఉన్నాం. తయారు చేసిన ప్రసాదం నచ్చితే మాకు మళ్లీ అవకాశం వస్తుందని ఆశిస్తున్నాం.

– నెయ్యిల లక్ష్మి, ప్రసాదం తయారీదారు చాపర గ్రామం

ఆడ దూడల పథకం వినియోగించుకోండి


చిట్టివలసలో లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న డీడీ దామోదరరావు

ఆమదాలవలస: తొంభై శాతం కచ్చితత్వంతో ఆడ దూడలు పుట్టేలా చర్యలు చేపడుతున్నామని, దాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి శాఖ జిల్లా కార్యనిర్వాహక అధికారి (డీడీ)ఎస్. దామోదర్ అన్నారు. మండలంలోని చిట్టివలస గ్రామంలో గర్భస్థ కోశ చికిత్స, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పథకానికి మంచి పశువుల ఎన్నికకు రైతులకు అవగాహన కోసం గ్రామంలో అన్ని పశువులను పరీక్షించినట్లు తెలిపారు. రూ.1350 విలువ గల రెండు వీర్య నాళికలు రూ.850, సబ్సిడీ పోగా రూ.500 మాత్రమే రైతులు ప్రభుత్వానికి చెల్లిస్తే ఆడ దూడలను పొందే వీర్య నాళికలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. వీర్య నాళికలు ఉపయోగించిన తర్వాత కూడా ఆవులు చూడు కట్టకుంటే రైతులు చెల్లించిన రూ.500 తిరిగి వారికే ఇచ్చేస్తామని తెలిపారు. ఆడ దూడకు బదులుగా మగ దూడ జన్మిస్తే రూ.250 తిరిగి రైతుకు అందజేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 42 పశువులకు గర్భ కోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. లేగ దూడల ప్రదర్శనలో భాగంగా 28 దూడలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన పాడి రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఆనందరావు, అక్కులపేట పశు వైద్యాధికారిణి డాక్టర్ వై.హేమలత, పశు వైద్యులు డాక్టర్ ఓంకార్, డాక్టర్ శరత్ చంద్ర, సిబ్బంది కళ్యాణి, సూర్యారావు, సూర్యమోహన్, గ్రామపెద్దలు గుజ్జల లక్ష్మణరావు, బంటుపిల్లి నారాయణరావు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత


లక్ష్మణరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పోలీస్ అసోసియేషన్ సభ్యులు

రణస్థలం: జిల్లాలోని సాయుధ దళంలో పనిచేస్తూ అనారోగ్యంతో ఈ నెల 1వ తేదీన కానిస్టేబుల్ ఎం. లక్ష్మణరావు మృతి చెందాడు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అదేశాల మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ తరఫున డెత్ రిలీఫ్ ఫండ్ ద్వారా తక్షణ ఆర్థిక సాయంగా ఒక రూ.లక్ష చెక్‌ను లక్ష్మణరావు భార్య సరస్వతికి గురువారం అందజేశారు. చెక్కు అందజేసిన వారిలో జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, కార్యవర్గ సభ్యులు నర్సింహులు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

నైవేద్యం సమర్పయామి..



హిరమండలంలోని కైవాడ వీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం యువకులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల పిండివంటలను నైవేద్యంగా నివేదించారు. అనంతరం గణపతి ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు. – హిరమండలం

13, 14 తేదీల్లో ఎన్‌సీఎస్‌టీ బృందం పర్యటన

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి, జలుమూరు మండలాల్లో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ బృందం ఈనెల 13,14 తేదీల్లో పర్యటించనున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

జాటోతు హుస్సేన్‌తో పాటు మరో ఆరుగురు బృందం పర్యటిస్తుందన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీకాకుళం కలక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, గిరిజన సంఘాల నాయకులతో వివిధ అంశాలపై చర్చిస్తుందన్నారు.

క్లుప్తంగా

100లీటర్ల సారా ఊట పట్టివేత



పట్టుబడిన సారా ఊటతో ఎస్సై సింహాచలం, సిబ్బంది

బలిజిపేట: మండలంలోని గలావిల్లి గ్రామ పరిసరాల్లో 100లీటర్ల సారా ఊటను ఎస్సై సింహాచలం, సిబ్బంది పట్టుకున్నారు. గురువారం వారికి అందిన సమాచారం మేరకు దాడిచేసి అక్కడ ఉన్న పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

భోగాపురం: మండల కేంద్రం భోగాపురానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీ గొల్లవీధికి చెందిన బమ్మిడి కనకరాజు(39) ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం కనకరాజు బహిర్భూమికని చెప్పి ఇంటికి సమీపంలో బుడబంద చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. బహిర్భూమి కని చెప్పి బయటకు వెళ్లిన వ్యక్తి ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులు చుట్టుపక్కల వెతుకుతూ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో శవమై తేలాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

కొత్తవలస: అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో కొత్తవలస మండలంలోని నిమ్మలపాలెం గ్రామం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. విశాఖపట్నంలోని దొండపర్తి ప్రాంతానికి చెందిన బి.అచ్చియమ్మ తన భర్త, కుమారుడు, బంధువులతో కలిసి కుమారుడు చంద్రశేఖర్ పెళ్లి సంబంధం విషయమై గంట్యాడ మండలం వెళ్లి తిరుగు ప్రయాణంలో కుమారుడు చంద్రశేఖర్ స్కూటీపై వస్తుండగా నిమ్మలపాలెం గ్రామం సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అచ్చియమ్మ ఆస్పత్రిలో మృతిచెందగా, చంద్రశేఖర్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి హత్య

గంట్యాడ: మండలంలోని పెదమధుపాడ గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు గల కారణంగా తెలుస్తోంది. ఈ విషయమై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నెక్కల చల్లం నాయుడు(30) బుధవారం రాత్రి వినాయక నిమజ్జనంలో అర్ధరాత్రి 12 గంటల వరకు పాల్గొన్నాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన పాటూరి సాయితో కలిసి రాత్రి ఒంటి గంట సమయంలో మద్యం తాగడానికి వెళ్లారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన పాటూరి సాయి రాయితో చల్లం నాయుడు తలపై బలంగా కొట్టడంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగి అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలియజేయగా సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. హత్యకు ఉపయోగించిన రాయిని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

నెల్లిమర్ల: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి పార్టీకీ తీరని లోటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎఫ్ఐ నుంచి అంచెలంచెలుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని కొనియాడారు. కుల, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో పయనించాలని పేర్కొన్నారు.

మక్కువలో అన్న సమారాధన

మక్కువ: స్థానిక కుమ్మరవీధిలో గురువారం వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు శంకరరావు హాజరై, భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. మండలంలోని పలు గ్రామాల నుండి వందలాది మంది భక్తులు హాజరై, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

హెచ్‌ఐవీ రోగులకు అందని పింఛన్లు..!

- 1500 మంది ఎదురు చూపు
- పట్టించుకునే నాథుడే కరువు

విజయనగరం ఫోర్ట్:

విజయనగరం పట్టణానికి చెందిన ఓవ్యక్తి హెచ్‌ఐవీ బారిన పడ్డాడు. దీంతో ఏఆర్‌టీ కేంద్రంలో రిజిస్టర్ చేయించుకుని మందులు వాడడం ప్రారంభించాడు. హెచ్‌ఐవీ బాధితులకు ఇచ్చే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇంతవరకు పింఛన్ మంజూరు కాలేదు. అలాగే జామి మండలానికి చెందిన ఓ వ్యక్తి హెచ్‌ఐవీ బారిన పడడంతో ఏఆర్‌టీ కేంద్రంలో రిజిస్టర్ చేయించుకుని మందులు వాడుతున్నాడు. హెచ్‌ఐవీ బాధితులకు ఇచ్చే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ వ్యక్తికి కూడా ఇంతవరకు పింఛన్ మంజూరు కాలేదు. వీరిద్దరే కాదు వందలాది మంది హెచ్‌ఐవీ బాధితులు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. నెలల తరబడి ఎదురు చూస్తున్నా వారికి మంజూరు కాలేదు. సాధారణ రోగుల మాదిరి తమకు పింఛన్ రాలేదని, హెచ్‌ఐవీ బాధితులు ఎవరినీ అడిగే పరిస్థితి లేదు. ఎందుకంటే తమకు ఉన్న వ్యాధి గురించి అందరికి తెలిసోపోతుందని వివరాలు గోప్యంగా ఉంచుతారు. దీంతో వారి పింఛన్‌ల మంజూరు గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. పింఛన్ల కోసం జిల్లావ్యాప్తంగా 1500 మంది హెచ్‌ఐవీ బాధితులు ఎదురుచూస్తున్నారు.



హెచ్‌ఐవీ బాధితులకు చికిత్స అందించే ఏఆర్‌టీ కేంద్రం

ఈ ఏడాది మే నెల నుంచి వారికి పింఛన్లు మంజూరు కాలేదు.

హెచ్‌ఐవీ రోగులకు పౌష్టికాహారం అవసరం

హెచ్‌ఐవీ రోగుల్లో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో వారు తరచూ అనారోగ్యం బారిన పడుతుంటారు. పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకుని, ఏఆర్‌టీ కేంద్రంలో అందించే మందులు వాడడం ద్వారా ఆరోగ్యంగా జీవించడంతో పాటు జీవితకాలం పెంచుకోవచ్చు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 1350 మందికి పింఛన్లు

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలిచింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల్లో అర్హులకు ఇచ్చిన మాదిరి హెచ్‌ఐవీ బాధితులకు కూడా జిల్లాలోని 1,350 మందికి పింఛన్లు మంజూరు చేసి అందజేసింది.

పింఛన్‌లు రావాల్సి ఉంది

హెచ్‌ఐవీ బాధితులు ఆన్‌లైన్‌లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. 1500 మంది హెచ్‌ఐవీ బాధితులకు పింఛన్లు రావాల్సి ఉంది.

డాక్టర్ వరలక్ష్మి,
ఏఆర్‌టీ కేంద్రం వైద్యురాలు

సువర్ణముఖిలో సిల్ట్ తొలగింపు

- బురదమట్టి వేరుచేసి ఇసుక సేకరణ
- బొబ్బిలిలో స్టాక్‌పాయింట్
- జేసీ సేతుమాధవన్

వంగర: మడ్డువలసలో గల గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ఎగువ భాగంలో సువర్ణముఖి నదిని ఆనుకుని ఉన్న కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల రక్షణ కోసం నదిలో మడ్డి, బురద, ఇసుక (సిల్ట్) తొలగింపు చర్యలు చేపడతామని జేసీ ఎస్.సేతుమాధవన్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన మండల పరిధిలోని కొండచాకరాపల్లి గ్రామం వద్ద సువర్ణముఖి నదిలో సిల్ట్ పేరుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నదిలో పేరుకుపోయిన మడ్డి, బురదను తొలగించి సేకరించిన ఇసుకను తరలించడం , స్టాక్‌పాయింట్ స్థలపరిశీలన వంటి అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సువర్ణముఖి నదిలో వరద పెరుగుతున్న సమయంలో వరదనీరు గ్రామాల్లో చొరబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు పంటలకు నష్టం జరుగుతుందన్నారు. కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల రక్షణ నిమిత్తం కొండచాకరాపల్లి వద్ద నదిని ఆనుకుని ఉన్న మడ్డి, బురద తొలగిస్తామని, అందులో ఇసుకను వేరు చేసి గ్రామ సమీపంలోని ఐటీడీఏ కాలనీని ఆనుకుని ఉన్న స్టాక్ పాయింట్‌కు తరలిస్తామని చెప్పారు. అక్కడి నుంచి బొబ్బిలిలో ఏర్పాటు చేసిన స్టాక్‌పా యింట్‌కు తరలించి జిల్లాలో ప్రజల అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని తెలిపారు. పూర్తిస్థాయిలో సమీక్షించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడగా కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాలను ఆనుకుని రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఇప్పటికే రూ.21 కోట్లతో ఏడాది క్రితం నివేదికలు అందించామని మడ్డువలస ప్రాజెక్టు అధికారులు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వివరించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి, మైనింగ్ డీడీ సూర్యచంద్రరావు, తహసీల్దార్ డి.ధర్మరాజు, మండల ఇరిగేషన్ అధికారులు డి.రవికుమార్, ఏఈలు రాజేష్, నితిన్, పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొండచాకరాపల్లిలో సువర్ణముఖి నది వద్ద సిల్ట్ తొలగింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

17నుంచి స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అక్టోబర్ 2న నిర్వహించే స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు సెప్టెంబర్ 17నుంచి అక్టోబర్ 1వ తేదీవరకు' స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమం జిల్లాలో నిర్వహించనున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. షెడ్యూల్ ప్రోగ్రాంను పర్యవేక్షించి, సమీక్షించడానికి జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీని కలెక్టర్ అధ్యక్షతన ఎస్పీ, మున్సిపల్ కమిషనర్, డీఆర్‌ఓ, డీఈఓ ఇతర అధికారులను కమిటీగా ఏర్పాటుచేయనున్నామని వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ కె. రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్

జిల్లాలో స్వచ్ఛత హై సేవ

విజయనగరం ఫోర్ట్: ఈనెల17 నుంచి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛత హై సేవా కార్యక్రమాలు జిల్లాలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన చాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహిచారు. సీపీఓ బాలాజీ, డీపీఓ శ్రీధర్ రా జా, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ, డీఈఓ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా కబడ్డీ పోటీలు

- 400 మంది క్రీడాకారుల హాజరు

విజయనగరం: రోటరీక్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవతరోత్సవ్ ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగుతోంది. విద్యార్థులు, యువతలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు నెల రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 400 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరుకాగా.. పోటీలను జిల్లాక్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. నేటి తరం పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. ఆ దిశగా తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు క్లబ్ ప్రతినిధులు మధ్యాహ్న భోజన సదు పాయం కల్పించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతుల ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నవతరోత్సవ్ చైర్మన్ జయకృష్ణ, మంచుకొండ అశోక్, క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి శంకర్‌రెడ్డి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు

10కిలోల గంజాయి పట్టివేత



నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నారాయణరావు, ఎస్సై తారకేశ్వరరావు

బాడంగి: మండలంలోని డొంకినవలస ఎత్తు కానా సమీపంలో హీరోహోండాపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపి తనిఖీ చేయగా వారి దగ్గర బ్యాగ్‌లో పది కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి బైక్‌ను, గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి డీఎస్పీ బాడంగి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ నిందితులను ఒడిశాలోని కొరాపుట్ జిల్లాకు చెందిన తునాహంటల్(24), బాలు హంటల్(42)గా నిర్ధారించామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిద్దరిని బొబ్బిలి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్‌లో మృతదేహం

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ వద్దనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్లపై సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు గురువారం తెలిపారు. మృతుడి శరీరంపై గ్రీన్ కలర్ టీషర్ట్, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, అతని కుడిచేతిపై జె అనే పచ్చబొట్టు ఉందని చెప్పారు. రైల్వే సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మనగ్రోమోర్ మేనేజర్‌కు షోకాజ్

గజపతినగరం: మండల కేంద్రంలోని మెంటాడ జంక్షన్ రోడ్డులో గల మన గ్రోమోర్ ఎరువుల షాపులో రైతులకు అవసరం లేని ఎరువులను అంటగడుతున్నారని కొంతమంది నుంచి ఫిర్యాదు రావడంతో మనగ్రోమోర్ మేనేజర్ కృష్ణకు షోకాజు నోటీసు జారీ చేసినట్లు స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారిణి సీహెచ్.ధనలక్ష్మి గురువారం తెలిపారు. వ్యవసాయరంగంపై ఆధారపడిన రైతులు ఖరీఫ్ వరిపంటకు అవసరమైన డీఏపీ, యూరియా ఎరువులు కావాల్సి వచ్చినప్పుడు సెంటర్‌కు వెళ్లి అడగ్గావాటితో పాటు అవసరం లేని గుళికలను మన గ్రోమోర్ అంటగడుతోందని ఫిర్యాదు రావడంతో మేనేజర్‌కృష్ణకు షోకాజు నోటీసు జారీచేసినట్లు ఏఓ చెప్పారు. రైతులకు అవసరం లేని ఎరువులను ఎందుకు విక్రయిస్తున్నావని దానిపై పూర్తి వివరణ (ఎక్స్‌ప్లనేషన్) ఇవ్వాలని నోటీస్‌లో పేర్కొన్నట్లు ఏఓ తెలిపారు. అనంతరం మనగ్రోమోర్‌లో ఉన్న ఎరువులను ఆమె తనిఖీ చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గ్రామాల మధ్య గల గెడ్డలో జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్.కోట మండలంలోని సందులూరు గ్రామానికి చెందిన అప్పబత్తుల సతీష్(30) తన భార్య వరలక్ష్మితో కలిసి బైక్‌పై అత్తవారి గ్రామం చంద్రంపేటకు బుధవారం వచ్చాడు. తిరిగి సాయంత్రం స్వగ్రామం సందులూరుకు బైక్‌పై వెళ్తుండగా చంద్రంపేట, వసంత గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డ దాటుతుండగా బండి స్లిప్ అయి గెడ్డలో గల్లంతయ్యాడు. బుధవారం రాత్రంతా గాలించినప్పటికీ సతీష్ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం తెల్లవారుజామున ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చేపట్టగా సతీష్ మృతదేహం కనిపించింది. అనంతరం మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.



గెడ్డలోంచి సతీష్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

పీఎం జన్‌మన్ పథకం తుది నివేదిక అందించాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రధానమంత్రి జన్‌మన్ పథకానికి సంబంధించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పంపిన ప్రతిపాదనలపై విచారణ నిర్వహించి తుదినివేదిక అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లో పీఎం జన్‌మన్ పథకం ప్రతిపాదనలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్‌మన్ కార్యక్రమం కింద ప్రతి గ్రామానికి కావాలిసిన ఇళ్లు, రహదారులు, వెల్‌నెస్ సెంటర్లు, పాఠశాలలు, మొబైల్ టవర్లు, విద్యుత్ సదుపాయం, తాగునీరు, అంగన్‌వాడీ సెంటర్లు, మొబైల్ మెడికల్ యూనిట్లు, మల్టీపర్పస్ సెంటర్లు వీడీవీకే ఏర్పాటు తదితర 11 అంశాలకు సంబంధించి అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8283 మందికి ఇళ్లు అవసరం కాగా 5874 మందికి ఇళ్లు మంజూరు చేశామని, మిగిలిన వారి వివరాలు విచారణ చేసి అర్హత ఉంటే జాబితాలో చేర్చాలని సూచించారు. 63 హ్యాబిటేషన్లు, 13,203 ఇళ్లకు మంచినీటి సదుపాయం కల్పించాలని చెప్పారు. 215 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని నివేదికలు వచ్చాయని, వాటిని పరిశీలించి తుది నివేదికను పంపించాలని స్పష్టం చేశారు. తుది నివేదికను ఆధారంగా చేసుకుని పథకాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీఈఓ జి.పగడాలమ్మ తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి:

పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కె.హర్షవర్ధన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీస్, విద్యాశాఖాధికారులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం పాఠశాలలోతరగతులు పూర్తయ్యాక సాయంత్రం వేళ విద్యార్థులంతా ఆటస్థలానికి వెళ్లిపోయారు. ఆ సమయంలో హర్షవర్ధన్ గురుకులంలోని డార్మిటరీకి వెళ్లి అక్కడ ఓ తాడు సాయంతో ఉరివేసుకున్నాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. ఆరోతరగతికి చెందిన విద్యార్థులు అటుగా వెళ్తూ డార్మిటరీలో హర్షవర్ధన్ ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి వెంటనే పదో తరగతి విద్యార్థులకు తెలిపారు. అనంతరం వారు, రాత్రి సిబ్బంది కలిసి ఉరి నుంచి విద్యార్థిని తొలగించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ విద్యార్థిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వెంటనే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎన్నారై ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు విద్యార్థికి సీపీఆర్ చేశారు. అయినప్పటికీ పరిస్థితి చెప్పలేమంటూ అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ పి శ్రీనివాసరావు, సీఐ కె.సతీష్ కుమార్, ఎంఈఓలు చల్ల లక్ష్మణ రావు, గొట్టాపు వాసు తదితరులు పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి ఆత్మహత్యా యత్నం చేసిన విద్యార్థికి చర్మవ్యాధి ఉందని గుర్తించారు. ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు కానీ, విద్యార్థులు కానీ ఏమన్నా అన్నారా? లేక తల్లిదండ్రులు మందలించారా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. విద్యార్థి హర్షవర్ధన్ గంట్యాడ మండలంలోని బురదపాడు గ్రామానికి చెందిన రైతు సంజీవరావు కుమారుడు. ఆ విద్యార్థికి తల్లి, సోదరి ఉన్నట్లు తెలియగా వారికి సమాచారమిచ్చారు.



ఎన్నారై ఆస్పత్రి వద్ద డీఎస్పీ, సీఐ, ఎంఈఓలు



హర్షవర్ధన్

యువత క్రమశిక్షణతో జీవించాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: యువత క్రమశిక్షణతో జీవించడం ద్వారా హెచ్‌ఐవీ బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఆగస్టు 29వతేదీన నిర్వహించిన 5 కె మారథాన్‌లో గెలుపొందిన వారికి గురువారం ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని సూచించారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి పొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. పురుషుల్లో పి.సాయికి ప్రథమ బహుమతి (రూ.7 వేలు), కె. రాముకు ద్వితీయ బహుమతి(రూ.4వేలు), బాలికలలో పి.వసంతకు ప్రథమ బహుమతి, వి.భార్గవికి ద్వితీయ అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీపీఎం ఉమామమేశ్వరావు, సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గంజాయి కేసుల్లో ప్రధాన సూత్రధారులను అరెస్ట్ చేయాలి

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణాను నియంత్రించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ స్టేషన్ పరిధిలో కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదై, దర్యాప్తులో ఉన్న గంజాయి కేసులను, మిస్సింగ్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి సంబంధిత దర్యాప్తు అధికారులకు చేపట్టాల్సిన చర్యలు గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి కేసుల్లో ప్రధానపాత్రధారులను, సూత్రధారులను, పరారీలో ఉన్న నిందితులను తప్పనిసరిగా అరెస్ట్ చేయాలన్నారు. నిందితుల ఆచూకీని కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి, సాంకేతికత పరిజ్ఞానంతో సమాచారం సేకరించి, వారిని అరెస్ట్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో దర్యాప్తులో ఉన్న అదృశ్యం కేసులను సమీక్షించి, ఆయా కేసుల్లో ఇంతవరకూ సంబంధిత అధికారులు చేపట్టిన దర్యాప్తును పరిశీలించారు. అదృశ్యం కేసుల పట్ల అలసత్వం వద్దన్నారు. కేసు నమోదైన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీని సాంకేతికత ఆధారంగా కనుగొని, వారి తల్లిదండ్రులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సైబర్ మోసాల కేసులను సమీక్షించి నిందితుల బ్యాంక్ అకౌంట్‌లలో ఫ్రీజ్ అయిన మొత్తాన్ని బాధితులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎం.వీరకుమార్, పి.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

చింతపల్లి పోలీస్ స్టేషన్ సందర్శన



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డీఎస్పీ కాళిదాసు

కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ నార్త్ డివిజన్ డీఎస్పీ ఎస్. కాళిదాసు చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులన్నీ తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడి పోలీస్‌స్టేషన్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా సముద్రానికి వచ్చే భక్తులు నీటిలో స్నానాలకు దిగి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా పలు సూచనలు చేశారు. మెరైన్ పోలీసులు తమ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మత్స్యకార గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలని కోరారు. నిలగడ్డ పేట సముద్ర తీర ప్రాంతానికి వెళ్లి అక్కడి మత్స్యకారులతో మాట్లాడారు. తుఫాన్ సమయంలో వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సముద్రం మీద విదేశీ బోట్లు, కొత్త వ్యక్తులు కనిపించి న ఎడల మెరైన్ పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచిం చారు. కార్యక్రమంలో చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ కె. వైకుంఠ రావు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.